ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024



నేడు పలు ప్రాంతాలకు విద్యుత్తు కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలోని తోటపాలెం, రైల్వే స్టేషన్, కంటోన్మెంట్ ప్రాంతాలకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలు వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. తోటపాలెం సబ్‌స్టేషన్, బ్యాంకు కాలనీ ఫీడరులో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఇందిరా నగర్, బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ కాలనీ, ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. బొగ్గులదిబ్బ ఫీడర్ పరిధిలోనిపోలయ్యపేట, ఎల్ బి. కాలనీ, వివేకానంద కాలనీ,మారుతీ నగర్, బొగ్గులదిబ్బ, ఆలకానంద కాలనీ, ఆర్అండ్‌బి జంక్షన్, కంటోన్మెంట్ ఏరియా, సిబి కాలనీలకు కూడా విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

గరివిడి మండలం కోనూరు, ఆర్తమూరు, తోండ్రంగి గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

ఖజానా నింపుకోవడానికి మద్యం దుకాణాలు పెంచి, ఆఘమేఘాలపై గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం, చౌక ధరల దుకాణాల ద్వారా కంది పప్పు ఇచ్చేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. మరోవైపు పప్పుల ధరలను కూడా అదుపు చేయడం లేదు. దీంతో, సామాన్యుడు పప్పుచారుకు కూడా నోచుకోలేని దుస్థితి దాపురించింది. మరోవైపు కూరగాయలు, నిత్యవసర సరుకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి.

కందిపప్పూ కరువే

- లక్ష్యం 581 టన్నులు.. వచ్చింది 40 టన్నులే
- కొన్ని నెలలుగా 260 టన్నుల మించి విడుదల చేయని వైనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో 581 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ కేజీ చొప్పున మొత్తం 581 టన్నుల కందిపప్పు జిల్లాకు రావాల్సివుంది. కానీ, అక్టోబర్ నెలకు సంబంధించి ఇప్పటి వరకు కేవలం జిల్లాకు చేరింది కేవలం 40టన్నులు మాత్రమే. అలాగని మిగిలిన 541టన్నులు వస్తుందనుకుంటే పొరపాటే. కొన్ని నెలలుగా జిల్లాకు కేవలం 260 టన్నులు మాత్రమే వస్తుంది. ఈ విషయాన్ని సాక్షాత్తు జిల్లా పౌర సరఫరా శాఖ అధికారే స్పష్టం చేశారు. ఇందులోనూ సగానికి సగం పక్కదారి పడుతోంది. జిల్లాలో మూడు రోజులుగా బియ్యం, పంచదార సరఫరా జరుగుతోంది. చాలా మంది పంపిణీదారులు కంది పప్పు ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతున్నారు. 20ప్యాకెట్లు మాత్రమే తమకు ఇచ్చారని కొందరు, 30ప్యాకెట్లు ఇచ్చారని మరికొందరు, పూర్తిగా ఇవ్వలేదని ఇంకొందరు చెబుతుండడమే ఇందుకు తార్కాణం. ప్రభుత్వ ఉదాసీనతను ఆసరాచేసుకుని, పంపిణీ దారులు కూడా కొద్దోగొప్పో పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కంది పప్పు ధర ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.200 పలుకుతోంది. ఆయిల్, ఇతర పప్పులు తదితర నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం టమాట ధర కూడా కేజీ రూ.100 ఉంది. అవి కూడా మార్కెట్‌లో తగినంతగా అందుబాటులో లేవు. మిగిలిన కూరగాయల ధరలు కూడా సామాన్యులు కొనుక్కోలేని పరిస్థితి దాపురించింది. అలాగని ఆమేరకు రైతులకు ఒనగూరిందీ ఏమీ లేదు. ప్రభుత్వం ధరలను నియంత్రించకపోవడం వల్ల నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయి. మార్కెట్‌పై పర్యవేక్షణ లేకపోవడం వల్ల కూరగాయల రైతులు దోపిడీకి గురౌతున్నప్పటికీ, దళారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సామాన్యులు మూడు పూటలా కడుపు నిండా తినలేని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్అండ్‌బి స్థలాన్ని లీజుకిస్తే ఊరుకోం

- ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడమే అభివృద్ధా ?
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆస్తి అయిన అర్ అండ్ బి స్థలాన్ని పిపిపి మోడల్‌లో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాలని అధికారంలోఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం చూడటం సరికాదని, అదే జరిగితే ఊరుకునేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. గతంలో ఆర్‌డిఒ కార్యాలయ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసి ఏమి అభివృద్ధి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రంలో ప్రభుత్వానికి చెందిన అర్అండ్‌బి స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు చెప్పడం సరికాదన్నారు. ఆర్డీవో కార్యాలయాన్ని గతంలో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేసి ఎన్ని ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెంచారో చెప్పాలన్నారు. ఆర్టీసి అర్ఎం కార్యాలయాన్ని కూడా ఇదే విధంగా అమ్మేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను అప్పనంగా దోపిడీ దారులకు లీజుకు ఇవ్వడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. నగరంలో అనేక జ్యూట్ మిల్లులు, చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయని, వాటిని తెరిపించేందుకు ఎటువంటి ఆలోచనా చేయకుండా ప్రభుత్వ స్థలాలను పిపిపి మోడ్‌లో 90 ఏళ్లకు లీజుకు ఇవ్వాలని చూడటం సరికాదని అన్నారు. 2047 విజన్ లక్ష్యంగా పని చేస్తున్నామని చెబుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ స్థలాలను, ఆస్తులను అమ్మేయడమే మీ విజన్ లక్ష్యమా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనాలు లేవని, ఇంధన వనరుల శాఖలు ప్రైవేటు భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. అర్అండ్‌బి స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టి వి రమణ పాల్గొన్నారు.

తొలి రోజు టెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టీచర్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. విజయనగరం జిల్లాలో 5 కేంద్రాల్లోను, మన్యం జిల్లాలో 4 కేంద్రాల్లోనూ పేపర్ 2 (ఎ) లాంగ్వేజ్ తెలుగు పరీక్ష నిర్వహించారు. ఉదయం పూట జరిగిన పరీక్షలలో 850 మందికి గాను 775 మంది హాజరు కాగా, మద్యాహ్నం 760 మందికి గాను 691 మంది హాజరయ్యారు. రాష్ట్ర పరిశీలకులు ఎ.సుబ్బా రెడ్డి, ఆర్‌డిఒ కీర్తి, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలనిర్వహణను పర్యవేక్షించారు.

బస్సుపాస్ వెబ్‌సైట్ ఆధునికీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

బస్సు పాసుల వెబ్‌సైట్ ఆధునీకరణ చేస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిధిలో గల విద్యార్థుల బస్‌పాసులు, ఎంఎస్‌టి పాసులను మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైటును అప్ గ్రేడ్ చేస్తున్న నేపథ్యంలో ఈనెల 5 నుంచి 6 వరకు ప్రస్తుతం పనిచేస్తున్న వెబ్సైటును నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 7వ తేదీ నుంచి యథావిధిగా బస్సు పాసులు జారీ చేస్తామని మేనేజర్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ప్రత్తి రైతుల జాబితాను సిద్ధం చేసి, కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. ప్రత్తికొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు తన ఛాంబర్లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లాలో నవంబరు రెండో వారం నుంచి ప్రత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఆ లోగా వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాజాం, రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీరైతు తాము పండించిన ప్రత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, కనీస మద్దతు ధరను పొందేలా చూడాలని జెసి కోరారు. దీనికోసం ప్రత్తి రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల వారీగా ముందుగానే సిద్దం చేయాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ ఎడి బి.రవికుమార్, జిల్లా అగ్నిమాపకాధికారి బి.రామ్‌ప్రకాష్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పివి రంగారెడ్డి, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ, మోటార్ వెహిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో దుర్గాప్రసాద్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయిలో జరిగిన యోగా ఛాంపియన్ షిప్‌లో ఎంఆర్ కానిస్టేబుల్ ఎం.దుర్గాప్రసాద్ జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో గురువారం అతనిని ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, మరిన్ని జాతీయ స్థాయి పతకాలు సాధించాలని అభిలషించారు. రాష్ట్ర పోలీసుశాఖ తరుపున వివిధ జిల్లాల నుండి 23మంది పోలీసు సిబ్బంది, అధికారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. దుర్గా ప్రసాద్ ప్రదర్శించిన యోగాసనాలకు కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, ఆర్ఎస్ఐ వర ప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

రైతు,కౌలు రైతు,ఐద్వా ఆధ్వర్యంలో నిరసన దీక్ష

దీక్ష చేస్తున్న రైతు, కౌలురైతు సంఘాలు, ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఎపి రైతు సంఘం,ఎపి కౌలు రైతుల సంఘం,ఐద్వా ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద దీక్ష చేపట్టారు. దీక్షను ఉద్దేశించి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి అర్.రాములు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి రమణమ్మ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఆయువు పట్టుగా ఉన్న ఏకైక పెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కు అన్నారు.

ఎంతో మంది ప్రాణాలు త్యాగ ఫలితంగా, వేలాదిమంది రైతులు భూములు దానం చేయడం వలన ఏర్పడిన పరిశ్రమను నేడు మోడీ ప్రభుత్వం అమ్మేయాలని చూస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్ష లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం, కౌలు రైతుల సంఘం నాయకులు పైడపునాయుడు, ఐద్వా నాయకులు వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే ప్రగతి సాధించాం

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే ప్రగతి సాధించిందని విజయనగరం టిడిపి పార్లమెంటు స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మూడు హామీలను నెరవేర్చిందన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఏం చేసిందని చెబుతున్న వైసిపి నాయకులు తమ హయాంలో వంద రోజుల్లో ఏం చేశారో ఆలోచించాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలలో పెన్షన్ మొత్తం పెంచారన్నారు. టిడిపి ప్రభుత్వం పేదల కోసం ఐదు రూపాయలకే భోజనాలను అన్నా క్యాంటీన్ ద్వారా ఏర్పాటు చేస్తే దానిని మీ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేశారని, వాటిని తిరిగి తెరిపించామని తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమ దిశగా చేపట్టడమే కూటమి లక్ష్యమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, గ్రంథాలయం మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, వి.ప్రసాద్, చంద్రశేఖర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

దసరా, పైడితల్లమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో దసరా, పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పై రెండు పండగల సందర్భంగా విజయనగరం, ఎస్.కోట డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 4 నుంచి 16వ తేదీ వరకు విశాఖపట్నం నుండి విజయనగరం వరకు, విజయనగరం నుండి బొబ్బిలి, మన్యం పార్వతీపురం చీపురుపల్లి, అనకాపల్లి తదితర నగరాలకు ప్రతీ రోజు రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతామని తెలిపారు. ఈనెల 10,11 తేదీల్లో హైదరాబాదు నుండి విజయనగరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులకు apsrtconline.in అనే వెబ్ సైట్ ద్వారా టికెట్స్ బుక్ చేసుకొనే సదుపాయం కల్పించామన్నారు. విజయవాడ నుంచి విజయనగరం వరకు ప్రతీ రోజు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించాలని కోరారు. విజయవాడ, హైదరాబాద్, ప్రాంతాల నుంచి వలస కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు సెలవులు నేపథ్యంలో స్వగ్రామాలకు రానున్నందున ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, భీమవరం నుంచి ఒకేసారి రెండు వైపులా రానుపోను టికెట్ బుక్ చేసుకున్నట్లయితే 10 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. గత ఏడాది దసరాకు 52 బస్సులు ప్రత్యేకంగా నడిపితే

రూ.19లక్షలు ఆదాయం వచ్చిందని, పైడితల్లి అమ్మవారి పండగకు 150 బస్సులు నడపగా మన్యం జిల్లా నుంచి రూ.8 లక్షలు, విజయనగరం జిల్లా నుంచి రూ.22 లక్షలు ఆదాయం వచ్చినట్లు అప్పలనారాయణ తెలిపారు. ఈ ఏడాది ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. విజయదశమి నేపథ్యంలో భవాని భక్తులకు వారు కోరుకొన్న ప్రదేశం నుంచి వారు కోరిన యాత్రా ప్రదేశాలకు బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు డిపో మేనేజరు విజయనగరం 99592 25620, అసిస్టెంట్ మేనేజర్ 9494331213, సూపరింటెండెంట్ 73829 21380, బుకింగ్ సూపర్‌వైజర్ 73829 23683, సిస్టం సూపర్‌వైజర్ 94403 59596 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

స్వయం ఉపాధి కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి కల్పనే ధ్యేయంగా నెలలో రెండుసార్లు మార్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ మార్ట్ ను ఆమె ప్రారంభించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేసేందుకు అర్బన్ మార్టులు ఏర్పాటు చేసి మహిళా ఉత్పత్తుల అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిపారు. కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇటువంటి మార్టులు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఒ సింహాచలం, సిటి మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రతీ వేదిక వద్ద ఉత్సవాలు

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాలు నగరం అంతటా సంబరంగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రతి వేదిక వద్ద వేడుకలు ఘనంగా జరగాలని, పండగ వాతావరణం ఉట్టి పడాలని తెలిపారు. కలెక్టర్ ఛాంబర్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు తో కలసి కలెక్టర్ ఇంచార్జ్ అధికారులతో కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్షించారు.. పండగ మూడు రోజులు విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్తుశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ భవనాలకు, పార్క్ లలో లైటింగ్ ఏర్పాటు చేయాలనీ, ప్రధాన కూడళ్ళ వద్ద స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. వేదిక వారీగా హాజరయ్యే కళాకారులకు, కవులకు, నటులకు , విద్యార్ధులకు అవసరమగు సర్టిఫికేట్లు, మెమెంటోలను ఇండెంట్ పెట్టి తీసుకోవాలని తెలిపారు. సైన్సు ఫేర్ కు వచ్చే విద్యార్థులకు చక్కటి భోజన, వసతిని ఏర్పాటు చేయాలని డిఇఒకు సూచించారు. కోట వద్ద లేజర్ షో ఈర్పాటు చేయాలనీ, అయోధ్య మైదానంలో రెండు రోజుల పాటు మెగా ఈవెంట్ జరుగుతుందని, పెంపుడు జంతువుల ప్రదర్శన పెట్ షో ఉంటుందని తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్ లో నున్న మన్సాస్ గ్రౌండ్‌లో డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన సరస్ ఎక్సిబిషన్ ఉంటుందని, అదే ప్రాంగణం లో పుష్ప ప్రదర్శన కూడా ఉంటుందని తెలిపారు. కోట లో సైన్సు ఫేర్ , స్టాంప్స్, కాయిన్స్ సేకరణ, ఆర్ట్ గాలరీ ఉంటుందన్నారు. గురజాడ కళాభారతి లో స్థానిక కళాకారుల చే నాటకాల ప్రదర్శన, ఏక పాత్రాభినయాలు ఉంటాయని, విజ్జి స్టేడియం లో క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ ఉంటాయని తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం లో స్థానిక కళాకారుల సంగీత నృత్య ప్రదర్శనలు ఉంటాయని, మహా రాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్ లో సాహిత్య గోష్టి , కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, లయన్స్ క్లబ్‌లో జానపద కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. బొంకుల దిబ్బ వద్ద నాటకాల ప్రదర్శన , కోట వద్ద పులివేశాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ అనిత, వేదికల ఇంచార్జ్ అధికారులు పాల్గొన్నారు.

రహదారులను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని, అపరిశుభ్రం చేస్తే అపరాధ రుసుం వేస్తామని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. గురువారం నగరంలో పర్యటించి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికై సిబ్బందికి తగు సూచనలు చేశారు. తోట పాలెం, విటి అగ్రహారం, వుడా కాలనీ ఫేస్ 1,2 కాళీఘట్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పలు సమస్యలపై సిబ్బందికి సూచించా రు. విటి అగ్రహారం పార్కు వద్ద అనధికారికంగా వాహనాలు నిలుపుదల చేయడానికి గమనించి తక్షణమే తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. పార్కు చుట్టూ మొక్కలు, పొదలు తొలగించి వేయాలని చెప్పారు. ఉడా కాలనీ లో ఉన్న పార్కు చుట్టూ జంగిల్ క్లియరెన్స్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే వార్డు సందర్శన

వార్డు పర్యటనలో భాగంగా నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు 11వ డివిజన్లో పర్యటించారు. అంబటిసత్రం జంక్షన్ నుండి ప్రారంభమైన వార్డు పర్యటన చందాల వీధి, కోట్ల మాదప్ప వీధి తదితర ప్రాంతాలలో సాగింది. అక్కడక్కడ సమస్యలను ప్రజలు అధికారులు దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగాదాయన మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎసిపి మధుసూదన్ రావు, ఎఇ సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.10 లక్షలు

12 గ్రాములు బంగారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి హుండా ఆదాయం గత 29 రోజులకు గాను రూ.10, 54, 690 , బంగారం 12 గ్రాముల 100 మిల్లా గ్రాములు వచ్చింది. గురువారం హుండీని లెక్కించారు. వీటితో పాటు వెండి 131గ్రాములు వచ్చినట్లు ఇఒ ప్రసాదరావు తెలిపారు. రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీని లెక్కించారు.

హుండీలో చెల్లని నోట్లు

హుండీ లెక్కింపులో పాత 2వేల రూపాయల నోట్లు, 500 రూపాయల నోట్లు, నకిలీ రోల్డ్ గోల్డ్ దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ప్రసాద్ రావు మాట్లాడుతూ హుండీలో ఇలాంటి నోట్లు భక్తులు వేయకూడదని సూచించారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములవుతాం

ఎసిపి రమణమూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరం అభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ విభాగం తరపున తాము భాగస్వాములుగా ఉంటామని టౌన్ ప్లానింగ్ విభాగం ఎసిపి ఐవి రమణమూర్తి అన్నారు. ఇటీవల ఎసిపిగా బాధ్యతలు చేపట్టిన రమణమూర్తి గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. నగరంలో భవన నిర్మాణ అనుమతుల విషయంలోను, అక్రమ నిర్మాణాలు, అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. కమిషనర్ నల్లనయ్య ఆదేశాలు మేరకు ప్రజాప్రతినిధుల సహకారంతో నగర అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటామని తెలిపారు. అందరి సహకారంతో టౌన్ ప్లానింగ్ విభాగం తరపున ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిలో గురువారం క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కాలేజీ నుంచి సిఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఆర్ వాసుదేవ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి జె నాగరాజు, ఎన్ఎస్ఎస్ విభాగం తరపున డాక్టర్ ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వైద్యానికి ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. మెట్టవలస గ్రామానికి చెందిన వై.వాసు రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజాం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్య కోసం చెక్కును సర్పంచ్ పువ్వల మాధవరావు, గ్రామ పెద్దల సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

బెల్టుషాపులను నివారించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

గాంధీ జయంతి రోజున మద్యం అమ్మకాలపై నిషేధం ఉన్నప్పటికీ పట్టణంలో విచ్చలవిడిగా మద్యం విక్రయించడం అన్యాయమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. మద్యాన్ని నియంత్రించాలని, బెల్ట్ షాపులను నివారించాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌కు చెప్పిన తరువాతే ఫిర్యాదు

ప్రజాశక్తి- డెంకాడ

గుణుపూర్‌పేట పంచాయతీ రికార్డులు మాయమైన విషయం సర్పంచ్‌కు చెప్పిన తరువాతే పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేశానని ఆ గ్రామ కార్యదర్శి బి. లక్ష్మణరావు తెలిపారు. గురువారం ప్రజాశక్తిలో 'పంచాయతీ రికార్డులు మాయం' అనే శీర్షికతో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై కార్యదర్శి స్పందించి వివరణ ఇచ్చారు. కాగా ఈ రికార్డుల మాయం విషయాన్ని నివేదిక రూపంలో డిపిఒకు పంపించామని ఎంపిడిఒ డిడి స్వరూపారాణి తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-బొబ్బిలి

చార్‌దాం యాత్రలో ప్రమాదానికి గురై గాయపడిన పి.గురునాయుడుకు సిఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బేబినాయన.. కోటలో గురువారం అందజేశారు. చార్ దాం యాత్రలో గాయపడిన గురునాయుడు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-కొత్తవలస

వాగ్దేవి డిఫెన్స్ అకాడమీలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం సిఐ బి.వెంకటరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నైపుణ్యాలను పెంచుకుంటూ, తల్లిదండ్రులను గౌరవిస్తూ, నిరంతరం శ్రమపడుతూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. నేటి యువత టెక్నాలజీను తప్పుగా ఉపయోగిస్తూ నేర ప్రవృత్తిని పెంపొందించే స్థాయిలో ఉంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. యువత ఆలోచన విధానంలో మార్పు రావాలని, కాలానుగుణ మార్పులను గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్ ప్రవీణ్, ప్రిన్సిపల్స్ లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పిఆర్‌టియు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఆర్‌టియు జిల్లా కార్యాలయాన్ని ఆ సంఘం సీనియర్ నాయకులు టిఆర్‌జె శర్మ సొంత భవనంలో గురువారం ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు వి.రవీంద్ర నాయుడు ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్ అర్. రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నిబంధనలు పాటించాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో కార్పొరేషన్ నిబంధనలు పాటించాలని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నందున, ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలూ జరుగకుండా పలు నియమాలు పాటించాలని తెలిపారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లకు శుభాకాంక్షలు తెలిపేందుకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. సదరు ప్రకటన బోర్డుపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ముద్రించరాదని తెలిపారు. అమ్మవారి పండగ ముగిసిన అనంతరం ప్రకటన బోర్డును ఏర్పాటు చేసిన వారే సదరు ఫ్లెక్సీలను తొలగించి, ఫ్లెక్సీలు ఏర్పాటుకై తీసిన గుంతలను వారే పూడ్చివేయాలని తెలిపారు. పాదచారులకు, వాహన చోదకులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదన్నారు. నగర పాలక సంస్థ ఏర్పాటు చేసే లైటింగ్, వాటర్ ఫౌంటైన్స్, లైటింగ్ ట్రైటిల్‌కు ఎటువంటి నష్టం కలిగించ వద్దని తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మి, జోగిరాజుపేట గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పట్టుశాఖాధికారి ఎవి సొల్మన్‌రాజు జోగిరాజుపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టు పురుగు, మల్బరి మొక్కలు పెంపకం, రాయితీ వివరాలు వివరించారు. అనంతరం పంట పొలాలును పరిశీలించారు. వ్యవసాయ అధికారి ఎమ్ పూర్ణిమ, విఎస్ఎ లలిత, విఎఎ హరికృష్ణ, శివప్రసాద్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని శిరికిపాలెం, అలమండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అనంతరం రైతులతో గ్రామ సభ నిర్వహించి, సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శిరికిపాలెం సర్పంచ్ రాజేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు లగుడు రవి కుమార్, పశువైద్యాధికారి అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకులు అనూషా, వంశీ, శివ, సతీష్ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ఆందోళన బాట

ప్రజాశక్తి- గరివిడి

ఎల్ఐసిలో చేపట్టిన మార్పులతో ఇటు ఎల్ఐసి ఏజెంట్లు, అటు పాలసీదారుల ప్రయోజనాలకు నష్టం కలిగించే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎఒఐ) ఏజెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరివిడి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్లు గురువారం ఆందోళన చేపట్టారు. పాలసీదారుల కనీస బీమాను పెంచడం, ఏజెంట్లు కమిషన్ తగ్గించడం వంటి నూతన విధానాలతోపాటు పాలసీ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. విధాన పరమైన నిర్ణయాలు, మార్పులు అంశం యూనియన్లతో చర్చించాలని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఏజెంట్ల ప్రయోజనాలు కాపాడేందుకు ఎల్ఐసి యాజమాన్యం చర్యలు చేపట్టాలని ఏజెంట్లు నినాదాలు చేశారు. ఎల్ఐసి గరివిడి బ్రాంచ్ అసోసియేషన్ అధ్యక్షుడు నడిమింటి సత్యనారాయణ, కార్యదర్శి ఎల్లంనాయుడు మాట్లాడుతూ ఏజెంట్లకు నష్టం కలిగించే విధాన పర నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

నెలే అన్నారు.. నడిరోడ్డుపై వదిలేశారు

- రోజువారీ మార్కెట్‌తో జనం అవస్థలు
- ఏళ్లుగా వీడని ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని పంచాయతీ
- రైతులు, ప్రజల ఆందోళన

ప్రజాశక్తి - జామి

ఏరు దాటాక తెప్ప తగలేసే చందంగా ఉంది... జామి పంచాయతీ అధికారుల తీరు. రోజువారీ మార్కెట్‌ను పంచాయతీ వేలం వేసిన ప్రతిసారీ... మార్కెట్ స్థలం మార్చేస్తామని చెప్పి, వేలం వేసి, ఆ తర్వాత రోడ్డుపైనే వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది కూడా అధికారులు అదే చేశారు. నెల రోజుల్లో మార్కెట్ స్థలం మార్చేస్తామని చెప్పారు. కానీ వేలం వేసి ఏడు నెలలు గడిచినా, రోడ్డుపైనే మార్కెట్ నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తున్న రోజువారీ మార్కెట్‌తో ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతుండటమే అందుకు నిదర్శనం. ఇంతకీ మార్కెట్ కష్టాలు తెలుసుకోవాలంటే.. ఈ కథనం పూర్తిగా చదవాల్సిందే..!

జామి మేజరు పంచాయతీ రోజువారీ మార్కెట్ నిర్వహణ ఏళ్లుగా వివాదాస్పదంగా నడుస్తోంది. గతంలో గ్రామంలో వారపు సంత కేంద్రంగా మార్కెట్ నిర్వహణ సాగేది. గతం కంటే రైతులు పెద్దఎత్తున కూరగాయల సాగు విస్తృతం చేశారు. దీంతో జిల్లాలో రామభద్రపురం తర్వాత ఎక్కువగా కూరగాయలు పండించే ప్రాంతంగా జామి ఉంది. పండించిన పంట అమ్ముకోవడానికి సరైన మార్కెట్ అవసరం. ఈ నేపథ్యంలోనే జామి మండల కేంద్రంలో ప్రతిరోజూ మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఈ నిర్వహణకు పంచాయతీకి లక్షల్లోనే ఆదాయం సమకూరుతోంది. కానీ మార్కెట్ నిర్వహణకు సరైన స్థలం ఏర్పాటు చేయడంలో పంచాయతీ ఏళ్లుగా విఫలమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రధాన రహదారిపై నడుస్తోన్న మార్కెట్‌తో వాహన చోదకులకు, అత్యవసర పనులపై వెళ్లిన ప్రజానీకాన్ని ట్రాఫిక్ అంతరాయం ముప్పు తిప్పలు పెడుతోంది. గంటల తరబడి వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర చికిత్సలు అందాల్సిన రోగులతో 108 వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని నిలిచిపోతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో వాహనాలు మార్కెట్‌ను దాటాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే కష్టపడి పండించిన కూరగాయలు అమ్ము కోవడానికి రైతులు, రహదారి గుండా ప్రయాణం చేయాల్సిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా మార్కెట్ ద్వారా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు, పాలక వర్గం మాత్రం మార్కెట్ నిర్వహణకు సురక్షితమైన స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని ప్రజల ఆరోపణ. ఇప్పటికే అనేక మార్లు మార్కెట్ వ్యవహారంపై పంచాయతీకి ఫిర్యాదులు అందాయి. పత్రికల్లో కథనాలు వెలువడుతున్నాయి. కానీ పాలకుల్లో మాత్రం ఇసుమంతైనా చలనం లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా మార్కెట్ నిర్వహణ....

ఏళ్లుగా తాత్సారం

గతంలో 'ప్రజాశక్తి' పలు మార్లు మార్కెట్ నిర్వహణకు స్థలం కేటాయించాలని కథనాలు ప్రచురించింది. దీంతో గతంలో మండల పెద్దల చొరవతో వారపు సంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, మార్కెట్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఏళ్లు గడుస్తున్నా.. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. మరోవైపు టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది కానీ ఆ నాయకులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోజువారి మార్కెట్ నిర్వహణకు అటు రైతులకు, ఇటు ప్రజలకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని పెద్దఎత్తున డిమాండ్ వినిపిస్తోంది.

సంత అభివృద్ధి చేస్తున్నాం

గ్రామంలోని వారపు సంత ప్రాంతాన్ని అభివద్ధి చేస్తున్నాం. ఇప్పటికే ప్రహరీ నిర్మించాం. కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, రోజువారి మార్కెట్‌ను అక్కడకు తరలించాలని చూస్తున్నాం. త్వరలోనే మార్కెట్ నిర్వహణ సమస్య పరిష్కారం అవుతుంది.

- శ్రీదేవి, ఇఒపిఆర్‌డి, జామి

విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలి

ఎపిఇపిడిసిఎల్ చీఫ్ విజిలెన్సు అధికారి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎపిఇపిడిసిఎల్ చీఫ్ విజిలిన్సు అధికారి కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ ఆశాఖ ఉద్యోగులకు సూచించారు. గురువారం ఆయన నగరంలోని ఎపిటిస్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిని ముందుగా గుర్తించి, కేసులు నమోదు చేయాలని విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణకు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయనను విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, పార్వతీపురం ఇఇలు పూడి హరి, జి.సురేష్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు.

వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-రామభద్రపురం

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రమామణి సూచించారు. మండల పరిధిలోని కొత్తరేగ గ్రామంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ప్రజలంతా కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు రుచికరమైన ఆహారం అందించాలని, పిల్లల్లో రక్తహీనత నివారించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచొచారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, గ్రామసర్పంచ్ కిలపర్తి మురళీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

పిహెచ్‌సి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక పిహెచ్‌సి భవన నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు, చేసిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా పిహెచ్‌సి భవనం అసంపూర్తిగా నిర్మాణ దశలో ఉండిపోయిందన్నారు. సిఎం దృష్టికి తీసుకెళ్లి, పిహెచ్‌సి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు బొబ్బిలి అప్పారావు, లెంక శ్రీను, పొట్నూరు వెంకట రత్నాజీ, నక్కరాజు చినరాము, కోరుబిల్లి ఉపేంద్ర, మాజీ సర్పంచ్ వీరోతు శివాజీ, బంగారు రమేష్, మాజీ సర్పంచ్ కోరుపోలు అప్పారావు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి- మెంటాడ

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రమీలా గాంధీ కోరారు. మండలంలోని కైలాం గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, పాఠశాలను, రేషన్ డిపోను, సచివాలయాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉంటున్నారని ఆమె దృష్టికి రాగా, గ్రామంలో కమిటీగా ఏర్పడి ప్రజలను చైతన్య పరిచి పాఠశాలలో చేర్పించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎపిఒ చిన్నప్పయ్య, వ్యవసాయ అధికారి గోకుల్ కృష్ణ, పంచాయతీ సెక్రెటరీ లెంక ప్రసాద్, విఆర్ఒ కొండమ్మ, జనసేన మండల అధ్యక్షులు సబ్బవరపు రాజశేఖర్, గృహ నిర్మాణ శాఖ అధికారి కె.డేవిడ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఆకులకట్ట, లక్ష్మీపురం పంచాయతీల్లో సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామసభలో గజరాయునివలస ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు, ఆకులకట్ట గ్రామసభలో సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి కొన్ని ప్రణాళికలను రూపొందించారు. ఉపాధి హామీ పనులు గుర్తించి తీర్మానించారు.

వేపాడ : మండలంలోని పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటుచేశారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం అవసరమైన ప్రణాళికలు తయారు చేశారు. సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుదీరిన అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి



ఆర్‌డిఒ రామ్మోహనరావు

బొబ్బిలి ఆర్‌డిఒగా విఎస్ఎస్ రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌డిఒగా పనిచేసిన సాయిశ్రీకి జమ్మలమడుగు బదిలీ అయింది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం ఆర్‌డిఒగా పనిచేసిన రామ్మోహనరావు బదిలీపై బొబ్బిలి వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఆర్‌డిఒ చెప్పారు.

తెర్లాం ఎంపిడిఒగా రాంబాబు

తెర్లాం : తెర్లాం ఎంపిడిఒగా ఆర్.రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండలంలో ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వర్తించిన ఆయన.. బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లారు. అక్కడ కొన్నాళ్లు పనిచేసి, తిరిగి మండలానికి ఎంపిడిఒగా వచ్చారు. ఎంపిడిఒను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాడంగి ఎంపిడిఒగా రామకృష్ణ

బాడంగి : బాడంగి ఎంపిడిఒగా శంబంగి రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తెర్లాం మండలం నుంచి బదిలీపై బాడంగి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎంపిడిఒ ఆంజనేయులు విశాఖపట్నం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

జొన్నాడ టోల్‌గేట్ వద్ద వాహన డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-గంట్యాడ

జొన్నాడ సమీపంలోని టోల్‌గేట్ వద్ద క్యాబ్ డ్రైవర్‌కు, టోల్‌గేట్ సిబ్బందికి బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఉత్తరాంధ్ర మహాసంగ్ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో టోల్గేట్ వద్ద ధర్నా చేపట్టారు. గాయపడిన డ్రైవర్‌కు న్యాయం చేయాలని, గాయపర్చిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భీమిలి, పద్మనాభం మండలాల సిఐలపాటు ఎస్ఐలు తమ సిబ్బందితో టోల్ గేట్ వద్దకు చేరుకొని ధర్నా చేస్తున్న డ్రైవర్లతో చర్చలు జరిపారు టోల్‌గేట్ యజమానిని పిలిపించి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని పోలీసుల హామీ ఇవ్వడంతో డ్రైవర్లు ఆందోళన విరమించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట : పట్టణంలోని పిఆర్ షటిల్ కోర్టులో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన బాలుర అండర్-14,17 బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ముగిశాయి. నియోజకవర్గ స్థాయి పోటీలకు 10 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.

ఏచూరి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిద్దాం

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించడమే మనం ఆయనకిచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. మండలంలో పోతనపల్లి జంక్షన్ వద్ద పెయింటర్ల కార్మిక సంఘం నాయకులు వజ్రపు అప్పారావు ఆధ్వర్యంలో గురువారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా జంక్షన్‌లో సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కష్టజీవులందరికీ, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. 18 రోజుల నుంచి మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆయన సంస్మరణ సభలను నిర్వహిస్తుండటమే అందుకు నిదర్శనమన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, బిజెపి విష కౌగిలి నుంచి దేశానికి విముక్తి కలిగించాలని ఇండియా బ్లాక్ ఏర్పాటుకు ఏచూరి కృషి చేశారన్నారు. అటువంటి మహానేత ఆశయాలను నెరవేరుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టి.వి.రమణ, సీతంపేట పాల సొసైటీ చైర్మన్ వి.సన్యాసప్పడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు ముత్యాలు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బేబినాయన నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువలా వచ్చాయి. వినతులను స్వీకరించిన బేబినాయన.. అర్జీలలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, ఎస్ఐ సాగర్‌బాబు, ఎంఇఒ త్రినాథరావు, టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకట్‌నాయుడు, నర్సుపల్లివెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

నందబలగకు చెందిన కొనపాల సంతోష్‌కుమార్ ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబినాయన వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధి నుంచి రూ.43,690 మంజూరు చేయించారు. ఆ చెక్కును సంతోష్ కుమార్‌కు అందజేశారు.

హామీలు అమలు చేయాలని వాలంటీర్ల వినతి

బొబ్బిలి : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వాలంటీర్లు.. గురువారం ఎమ్మెల్యే బేబినాయన, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరికి వినతులు అందించారు. కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు రూ.10వేలు వేతనం ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ, వార్డు వాలంటీర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.భాస్కరరావు కోరారు. హామీలను అమలు చేసి ఉపాధి కల్పించాలని కోరారు.



ఎమ్మెల్యే బేబినాయనకు వినతి అందిస్తున్న వాలంటీర్లు

ప్రజల నుంచి వినతులు స్వీకరణ

విజయనగరం టౌన్ : స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మిగజపతిరాజు గురువారం నగరంలోని కొత్తపేట బ్రహ్మం గారి మఠం రోడ్డు వద్ద గురువారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు. 1వ డివిజన్ నుండి 15వ డివిజన్ పరిధిలో గల ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఆయా వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వారి సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ప్రజలు పార్టీ కార్యాలయానికి వచ్చి అనేక సమస్యలు తెలియజేస్తున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజల వద్దకు వచ్చి వినతులు తీసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

గ్రామాల్లో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పరిధిలోని సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో మన ఊరి బడి అనే నినాదంతో గురువారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను సర్పంచ్ మురిపిండి గంగరాజు ప్రారంభించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ బిపిఎ రాజు, బేసిక్ స్కౌట్ మాస్టర్ పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలు, కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ బడులలో సదుపాయాలు, గతేడాది పాఠశాల ప్రగతి, పాఠశాల ప్రత్యేకతలు వివరించే బ్రోచర్లు ఇంటింటికీ పంపిణీ చేశారు. బడిఈడు పిల్లలందరినీ బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు రవిశంకర్ పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాల మూసివేతకు వ్యతిరేకంగా

ఎస్ఎఫ్ఐ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని సిబిఎం బాలికల ఉన్నత పాఠశాల మూసివేతకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్ మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతంలో వందేళ్ల చరిత్ర ఉన్న సిబిఎం పాఠశాలను మూసివేస్తే పేద విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. మూసివేతను అడ్డుకునేందుకు విద్యార్థులను, తల్లిదండ్రులను ఏకం చేసి ఆందోళన చేస్తామన్నారు. అందులో భాగంగానే సంతకాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా సంతకాలు పెట్టి మద్దతు తెలిపారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక పోలీసు స్టేషనులో 2021 సంవత్సరంలో నమోదైన హత్య కేసులో నిందితుడైన భోగాపురం మండలం, కొంగవానిపాలెం గ్రామానికి చెందిన బేపల గోవింద్‌కు విజయనగరం మహిళా కోర్టు జడ్జి ఎన్. పద్మావతి జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు. కొంగవానిపాలేనికి గోవింద్ రోజూ మద్యం సేవించి తన భార్య బేపల మంగమ్మతో గొడవ పడుతూ, వారి పిల్లల బాగోగులు చూసేవాడు కాదు. ఈ క్రమంలో 2021 జనవరి 15న భార్యతో గొడవ పడి ఆమెను ఇనుప రాడ్డుతో తలపై కొట్టి హత్య చేశారు. ఆమె సోదరి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసారు. హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు రూ. 2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

విజయనగరం కోట : మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం ఇస్తున్న మెస్‌ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా బకాయి ఉన్న మెస్‌ఛార్జీలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డేగల అప్పలరాజు, పురం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని లింగాలవలస గ్రామంలో గురువారం పాముకాటుతో ఓ రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు కుమిలి రామకృష్ణ పొలం పనుల నిమిత్తం వెళ్లగా పాము కాటేసింది. సమీపంలో ఉన్న ఆయన చిన్న కుమారుడు శ్రీను, కుటుంబసభ్యులు వెంటనే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రామకృష్ణ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు.

21 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని రైల్వేస్టేషన్ సమీపాన 21 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కబీరుద్దీన్ మంజూర్ ఆలీ ఒక అమ్మాయితో కలిసి కోరాపుట్‌లోని ఓ లాడ్జిలో దిగాడు. అక్కడ న్యూటన్ అనే వ్యక్తి వద్ద రెండు బ్యాగులతో 21 కేజీల గంజాయిని కొని కోరాపుట్ నుండి గంజాయిని పట్టుకుని గురువారం ఉదయం రైలులో విజయనగరం రైల్వే స్టేషన్ లో దిగాడు. అక్కడి నుంచి ముషీరాబాద్ వేరే ట్రైన్ లో వెళ్లిపోవాలని భావించాడు. ఇంతలో టిఫిన్ చేద్దామని బయటకు రాగా వాష్ రూమ్ కని వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఇంతలో వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

17 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేటలో 17 అక్రమ మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. గురువారం ఎక్సైజ్ దాడుల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. అక్రమ మద్యం రవాణా, అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.